# థ్రిల్...

హాయిగా నవ్వి ఎంత కాలమైందో...?!

అప్పుడెప్పుడో... ఆరునెలల క్రితమనుకుంటాను... నా చిన్నప్పటి నేస్తం రాజ్యలక్ష్మి మొగుడితో కలిసి మా ఊరొచ్చినప్పుడు... నేనూ రాజ్యలక్ష్మి మా ఇంటి డాబామీద వెన్నెల్లో కూర్చుని చిన్నప్పటి జ్ఞాపకాలను తవ్వుకున్నప్పుడు అప్పుడే హాయిగా చాలా హాయిగా నిష్కల్మషంగా... నిర్మొహమాటంగా నవ్వాను.

అంతే-

అప్పట్నుంచీ నా మామూలు నవ్వు.. రొటీన్ నవ్వు... హిపాక్రటిక్ నవ్వు... నవ్వటం అంటే రెండు పెదవులను చివరికంటా సాగదీసి పళ్ళు బయటపెట్టటం కాదని నా ఉద్దేశం. గుండెల్లోంచి రావాలి... మనసు స్పందించాలి... కళ్ళల్లో నీళ్ళు తిరగాలి... అదీ నిజమైన నవ్వు....హాయైన నవ్వు.

"మేడమ్... సార్ పిలుస్తున్నారు"

అటెండర్ మాటతో ఆలోచనలకు స్వస్తి చెప్పి లేచినిల్చున్నాను. ఎదురుగా కూర్చున్న అకౌంటెంట్ శ్రీహరిని చూశాను. యాభైఏళ్ళుంటాయి. అప్పటివరకూ నన్ను గమనిస్తున్నాడు కాబోలు. నేను చూడటంతో చప్పున ముఖం తిప్పుకున్నాడు. నవ్వుకున్నాను. జాలినవ్వు... నామీద- శ్రీహరి మీద జాలి...

పెళ్ళయిన ఆరునెలలకే అమెరికా వెళ్ళిపోయిన మా ఆయన తిరిగి రెండు సంవత్సరాలగ్గానీ రాడని ఈ ఆఫీస్‌లో అందరికీ తెలుసు.

అందుకే నేనంటే అందరి చూపుల్లో ఓ విలక్షణత స్పష్టంగా కనిపిస్తుంది.

"యస్ సర్" ఆఫీసర్ ఛాంబర్‌లోకి వెళ్ళి అన్నాను.

"ఏదో ఫైలు చూస్తున్న అతను చప్పున తలెత్తి-

"వచ్చావా వీణా- ఓ చిన్నహెల్ప్ చేసిపెట్టాలి" అన్నాడు నవ్వుతూ.


"చెప్పండి సర్" అన్నాను అతని తలను చూస్తూ

ఆ తలను అంత నైపుణ్యంగా దువ్వుకోవటానికి అతనెంత సమయాన్ని వెచ్చిస్తాడో నా ఊహకందదు. బట్టతల కనిపించకుండా పక్కన జుట్టు పెంచి దాన్ని బట్టతల కవరయేలా దువ్వుతాడు.

నలభై అయిదేళ్ళుంటాయి. అయినా ఇంకా పాతికేళ్ళ కుర్రాడిలా కనబడాలన్న తపన అతని ప్రతి అణువులో కనిపిస్తోంది.

"ఏమీలేదు. ఈరోజు మా మిసెస్ బర్త్‌డే... ఆమెకో సర్‌ప్రైజింగ్ గిఫ్ట్ ఇవ్వాలని నా ఉద్దేశం. నాకా సెలక్షన్ తెలీదు. అందుకే ఇఫ్‌యు డోంట్‌మైండ్ ఈవెనింగ్ ఆఫీస్ అయ్యాక ఓ గంట స్పేర్ చేస్తే ఓ మంచి చీరె సెలెక్ట్ చేద్దువుగాని" అన్నాడు నవ్వుతూ.

"ఎక్స్‌ట్రీమ్లీ సారీసర్. ఈరోజు ఈవెనింగ్ మా ఆయన అమెరికా నుంచి ఫోన్ చేస్తారు. ఇంటి దగ్గరే ఉండమని చెప్పారు. సారీ" అన్నాను.



అతని ముఖంలో రంగులు మారాయి..

"ఇట్సాల్ రైట్... నేనే ఎలాగో మేనేజ్ చేస్తాను" అన్నాడు బాధగా.

"పోనీ స్టెనో భవానీని తీసుకెళ్ళండి సర్. తన సెలక్షన్ చాలా బావుంటుంది" అన్నాను.

"అలాగా... చూస్తాను... చూస్తాను..." అన్నాడు కంగారుగా.

ఉబికి వస్తున్న నవ్వును నిగ్రహించుకున్నాను. ఈ ఆఫీసరే ఓరోజు ఇలాగే తన పెళ్ళానికి ఏదో గిఫ్ట్ ఇవ్వాలని నన్ను తీసుకెళ్ళి ఓ రింగ్‌కొని... ఆ తర్వాత నన్ను హోటల్‌కు తీసుకెళ్ళి ఐస్‌క్రీం ఇప్పించి...ఇద్దరం తింటుండగా అతని ఫ్రెండ్ ఎవరో పలకరించినప్పుడు నన్ను తన గాళ్‌ఫ్రెండ్‌గా పరిచయం చేశాడు.



**కోడూరు రామమూర్తి**

నేను షాకయ్యాను. అప్పుడేమీ అనలేకపోయాను. హోటల్ నుంచి బయటికొస్తుంటే నా ఫ్రెండ్ కనిపించింది. నేను అతన్ని నా అంకుల్‌గా పరిచయం చేశాను.

ముఖం మాడిపోయింది గురుడికి.

భవానీ గున్నఏనుగులా ఉంటుంది. అందుకే ఆమెను తీసుకెళ్ళమన్నాను. అంతే! గంభీరంగా వెళ్ళమన్నట్టు తలూపాడు.

వచ్చి సీట్లో కూర్చున్నాను. వాచీ చూసుకున్నాను. ఇంకో అరగంట ఉంది. అటెండర్‌ను పిల్చి టీ తెప్పించుకున్నాను. శ్రీహరి సీట్లో లేడు. బహుశా నాగురించి ఆలోచించటానికే క్యాంటిన్‌కు వెళ్ళి ఉంటాడు. అతని భార్యకు ఏదో జబ్బుట. మంచం మీద నుంచి లేవలేదట. పాపం. ఆ సుఖం శ్రీహరికి లేదట. అందుకే కాబోల ఇరవై నాలుగ్గంటలూ వాడి చూపు నన్ను తినేస్తూనే వుంటుంది. మాఆయన గుర్తొచ్చాడు.

అమెరికా వెళ్ళిన ఈ సంవత్సరంలో కేవలం నాలుగు ఉత్తరాలు మాత్రం రాశాడు. అదీ చాలా రొటీన్‌గా. నేనిక్కడ క్షేమం. నువ్వు క్షేమమని తలుస్తానుతో ప్రారంభమై... ఇట్లు నీ భర్తతో అంతమౌతుంది. కొత్తగా పెళ్ళి చేసుకున్న పెళ్ళానికి రాయాల్సిన ఉత్తరమేనా అనిపించి- నేను జవాబుగా నేనతన్ని ఎంత మిస్సయ్యానో వివరించి- వెన్నెల చల్లగాలి- మల్లెపూలు వాటిని చూస్తుంటే నాలోని భావ సంచలనం ఎలా ఉంటుందో అద్భుతంగా రాశాను.

నాలుగు నెలలవరకూ జవాబు లేదు. తర్వాత వచ్చింది. 'నీ ఉత్తరం చేరింది. బిజీగా ఉండటం వల్ల వెంటనే రిప్లై ఇవ్వలేకపోయానుతో ప్రారంభమై ఇట్లు నీ భర్త'తో సమాప్తం.

ఇక ఆ మనిషి మనస్తత్వమే అదనుకుని నేను రొటీన్‌గా రాయటం ప్రారంభించాను. కేవలం మూడుసార్లు మాత్రం ఫోన్‌చేశాడు. అంతే- ఆఫీసర్‌గాడి బారి నుంచి తప్పించుకోవటానికి అబద్ధం ఆడాను. అసలాయన అమెరికాలో చేస్తున్న ఉద్యోగమేంటో- కొత్త పెళ్ళాన్ని వదలి అమెరికా వెళ్ళిపోవటం ఎందుకో నాకర్థంకాలేదు.

శ్రీహరిలాగానే ఆయనా అక్కడ ఆ సుఖానికి దూరంగా ఉన్నాడా? ఉండాలికదా? ఏమో... ఎవరికి తెలుసు... అక్కడసలు అలాంటి పట్టింపులు ఉండవట.

నా మనస్సెందుకో దిగులుగా అనిపించింది.

అయిదయిపోయింది. లేచి బ్యాగ్ సర్దుకుని ఆఫీస్‌దాటి- బయటకొచ్చాను. ఆఫీసర్ పాపం ఒక్కడే కార్లో వెళ్తూ... నన్ను చూసి గంభీరంగా బాధగా నవ్వాడు. నేను జాలిగా నవ్వాను.

రాజ్యలక్ష్మి మళ్ళీ వస్తే బావుండును.

హాయిగా నవ్వుకోవచ్చు. పోనీ నేనే వెళ్తే...? పిలవని పేరంటానికి వెళ్ళినట్టు ఉంటుందనిపించింది. బస్ కోసం వెయిట్ చేసే ఓపిక లేదు.

ఆటో ఎక్కాను. ఇంటివెళ్ళేముందు రొటీన్‌కు భిన్నంగా ఏమైనా సంఘటనలు జరుగుతాయేమోనని ఊహించుకుంటాను. నేను వెళ్ళేసరికి మా ఆయన అమెరికా నుంచి నన్ను సడన్ సర్‌ప్రైజ్ చేయటానికి వచ్చుంటాడు. లేదా ఆయన రాసిన ఉత్తరం వచ్చి ఉంటుంది. లేదా రాజ్యలక్ష్మి నాకోసం ఎదురుచూస్తుంటుంది. లేదా...

"ఏమ్మా అలా ఉన్నావేం ఆరోగ్యం బాగోలేదా?" అనే అమ్మ రొటీన్ డైలాగ్ కాకుండా ఇంకేదైనా అంటుంది.

రిటైరయిన నాన్న ఆ పడకకుర్చీలో కూర్చుని పేపర్ చదవకుండా కనీసం గార్డెన్‌లో కుర్చీ వేసుకుని చదువుతుంటాడు. పక్కింటి కాలేజీ కుర్రాడి గదిలోంచి స్టీరియో వినిపించకుండా ఉండాలి.

ఇలా ఊహించుకుంటాను...

కానీ ఒక్కటీ నేను అనుకున్నట్టు జరగదు. అన్నీ అలాగే ఉంటాయి.

విసుగేస్తుంది నాకు.

జీవితం యమ బోర్‌గా అనిపిస్తోంది.

పోనీ ఆ ఆఫీసర్‌గాడితో షాపింగ్‌కు వెళ్ళి వాడికింకో షాక్ ఇచ్చినా బాగుండేదేమో. శ్రీహరిని చూసి ఓ నవ్వు విసిరితే కొంచెం వెరయిటీగా థ్రిల్లింగా ఉండేదేమో.

ఛ- నేనేం ఆలోచిస్తున్నాను?

నాకు పెళ్ళయింది. నాకో మొగుడున్నాడు. అంచేత నేను అలాంటి ఆలోచనలకు చోటివ్వకూడదు. ఈ దేశ సాంప్రదాయాన్ని నిలబెట్టే పవిత్రమైన బాధ్యత ఈ సమాజం నామీద ఉంచింది.

కోసంగా నవ్వుకున్నాను.

అంటే ఆ బాధ్యత ఆఫీసర్‌గాడికి లేదా? శ్రీహరికి లేదా? నా అమెరికా మొగుడికి లేదా? ఇంటిముందు ఆటోదిగి- గేటు తీశాను... ఆశ్చర్యం... పడకకుర్చీలో నాన్నలేడు. తోటలో చూశాను. అక్కడ కూడా లేడు. చాలా థ్రిల్లింగా ఫీలయ్యాను. ఈరోజు- ఈ సాయంత్రం నా జీవితంలో ఏదో గొప్ప థ్రిల్ జరగబోతోందనిపించింది. నేను మెట్లెక్కి వరండాలోకి రాకముందే ఎదురొచ్చే అమ్మకూడా రాలేదు.

అప్పుడు గుర్తొచ్చింది నాకు. పక్కింటి స్టూడెంట్ కుర్రాడి స్టీరియో కూడా వినిపించటంలేదు!

ఆనందంతో ఉక్కిరిబిక్కిరవుతూ లోపలికెళ్ళాను. అక్కడ-

అమ్మను నాన్న ఓదార్చుతున్నాడు. అంతేకాదు నాన్నకూడా ఏడుస్తున్నాడు. నాకేం అర్థంకాలేదు.

"ఏమైంది నాన్నా" అయోమయంగా అడిగాను. అమ్మ నన్ను చూసి బావురుమని ఏడుస్తూ వచ్చి కౌగిలించుకుంది.

"ఏమైందమ్మా- చెప్పు" అన్నాను ఆశ్చర్యంగా. అమ్మ ఏడుస్తూ చెప్పింది.

"నీ జీవితం నాశనమైపోయిందే తల్లీ- భగవంతుడు నీ కన్యాయం చేశాడమ్మా"

నా మనసు కీడు శంకించింది. కొంపతీసి ఆయనకేమీ కాలేదుకదా!

"ఏమైందమ్మా... నాన్నా... నువ్వన్నా చెప్పు" ఆతృతగా అడిగాను.

నాన్న మాట్లాడలేదు. చేతిలో ఉత్తరం పెట్టాడు. ఆతృతగా విప్పి చదివాను.

"నేనిక్కడ ఓ అమెరికన్ అమ్మాయిని పెళ్ళిచేసుకున్నాను. విడాకులు పంపిస్తున్నాను. క్షమించగలవు. ఇట్లు...."

నిజం...

ఆ క్షణం నేను గొప్ప థ్రిల్ ఫీలయ్యాను.

హాయిగా నవ్వుకోవాలనిపించి- నా గదిలోకి నడిచి తలుపేసుకుని బెడ్‌మీద వాలాను.

చిత్రం... నాకు నవ్వురాలేదు...

నేను ఏడుస్తున్నాను!! ●